నవరత్నాలతో అన్ని వర్గాల సంక్షేమం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పూలకుంటపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని పూలకుంటపల్లి, బచ్చలవాండ్లపల్లి, కుమ్మరిండ్లు, ఏటిగడ్డ తండా, బోడిగుంట్లపల్లి, గోపాల్‌నాయక్ తండాలో శనివారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం నుంచి చేకూరుతున్న లబ్ధిని తెలియజేశారు. కొందరు తమ సమస్యలను తెలియజేయగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరింపజేశారు. మహిళలతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల డబ్బు నేరుగా ఖాతాలోకి జమ అవుతోందా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడుతూ ఏ పథకానికైనా ఎవరికీ పైసా లంచం ఇవ్వకుండా వలంటీర్ల ద్వారా పనులు చేయించుకోవాలన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లు, రేషన్‌కార్డుల గురించి తెలియజేశారు. అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి మున్సిపాలిటీ పార్టీ పరిశీలకుడు శివశంకర్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శేషూరెడ్డి, బట్రాజుల సంఘం రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రాజు, టౌన్ కన్వీనర్ సుధాకర్‌రాజు, సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, బొట్టుస్వామి, సర్పంచ్ అర్పిత, ఎంపీటీసీ శకుంతలమ్మ, వివిధ కమిటీల నాయకులు సూర్యనారాయణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, జనార్దన్‌రెడ్డి, రంగారెడ్డి, నాగరాజు, వెంకటరెడ్డి, సిభక్తుల్లా, బాషా, హరినాథరెడ్డి, మల్లిరెడ్డి, తిమ్మిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణ నాయక్, పారేశ్ నాయక్, శ్రీనివాసరెడ్డి, ఓడిచెరువు అగ్రిబోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, వెంకటరంగారెడ్డి, ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎస్‌ఐ వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


పూలకుంటపల్లిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

బాధితులకు సీఎం సహాయ నిధి అండ

గాండ్లపెంట: మండల కేంద్రానికి చెందిన సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలీ కుమారుడు మహమ్మద్ రఫీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు సీఎం వైఎస్ జగన్‌కు విన్నవించగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరైంది. ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి శనివారం హైదర్‌వలీకి చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితులకు సీఎం సహాయ నిధి అండగా ఉందన్నారు. కాగా తమ కుటుంబాన్ని ఆదుకున్న సీఎం జగనన్నకు, ఎమ్మెల్యేకు తాము రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. కదిరి వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త ఇస్మాయిల్, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, న్యాయవాది ఫైజుల్లా పాల్గొన్నారు.


రూ.5 లక్షల చెక్కును హైదర్‌వలీకి అందిస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

ఎమ్మెల్యే పరామర్శ


సంజీవరాయుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: గొట్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సంజీవరాయుడు పాముకాటుకు గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శనివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. రూ.50వేల ఆర్థికసాయం అందించారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

దళితుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తాడిమర్రి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే దళితుల సంక్షేమం సాధ్యమని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య అధ్యక్షతన దళిత రైతులకు పీఎంఏజేఏవై పథకం ద్వారా వంద శాతం రాయితీపై రూ.10 వేల విలువ చేసే విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేశారు. మండలంలో 68 మంది రైతులకు రూ.6.80 లక్షల విలువ చేసే కందులు, పెసర, వేరుశనగ, రాగులు, కొర్రలు, సజ్జలు, నీటి డ్రమ్ములు, టార్పాలిన్, పసుపు జిగట అట్టలు, లింగాకర్షణ బుట్టలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైస్ ఎంపీపీ బీసాని లింగమ్మ పాల్గొన్నారు.


మహిళా రైతుకు రాయితీ విత్తన కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

బాలలను పనుల్లో పెట్టుకోవడం నేరం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని రెడ్స్ కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. జయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలలతో పనులు చేయించడం నేరమన్నారు. బాలలకు హక్కులు తెలియజేయాలన్నారు. బాలలను బడులకు పంపి విద్యావంతులను చేయాలన్నారు. లేబర్‌ఆఫీసర్ జహరుద్దీన్, సరస్వతి, రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానుజా, న్యాయవాది నరసింహులు పాల్గొన్నారు.

తాడిమర్రిలో 39.2 మి.మీల వర్షం

తాడిమర్రి: తాడిమర్రిలో 39.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ సౌమ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం తెల్లవారుజామున 2.15 నుంచి ఉదయం 6 గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో వరి, కంది తదితర పంటలు సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చీనీ, మామిడి తదితర పండ్లతోటలకు ఈ వర్షాలు ఎంతో ఉపయోగ పడుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కూలిన భారీ వృక్షం


బుక్కపట్నం ప్రధాన రహదారిపై కూలిన చెట్టు

పుట్టపర్తి: శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బుక్కపట్నం ఫారెస్టు సిబ్బంది క్వార్టర్స్ వద్ద ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న భారీ వృక్షం కూలిపోయింది. కొమ్మలు రోడ్డుకు అడ్డంగా పడటంతో రాక పోకలకు అంతరాయం కలిగింది. శనివారం ఉదయం 6 గంటలకే అటవీ సిబ్బంది వచ్చి చెట్టును తొలగించారు. రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత, రాకపోకలు లేని సమయంలో చెట్టు కూలడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రూ. 7 లక్షల బీమా అందజేత


రూ.7 లక్షల చెక్కు అందజేస్తున్న డీఎం

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో సర్వీసులో ఉండి కోవిడ్ సమయంలో చలపతి అనే డ్రైవర్ మృతి చెందాడు. ఎంప్లాయిస్ బీమా కింద రూ.7 లక్షలు మంజూరు కాగా మృతుని భార్య సుశీలకు శనివారం డీఎం మైనోద్దీన్ చెక్కు అందజేశారు. డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని డీఎం తెలిపారు. అసిస్టెంట్ డీఎం హరిమోహన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఖాద్రీశుని ఆలయం కిటకిట

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలతోపాటు కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం చేశారు.

విద్యా సామగ్రి అందజేత

పుట్టపర్తి అర్బన్: అమెరికాలో ఉన్న సత్యసాయి భక్తుల సహకారంతో పుట్టపర్తికి చెందిన శ్రీవాణి బ్లోసమ్స్ ట్రస్ట్ పుట్టపర్తి మండలం బత్తలపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు శనివారం పుస్తకాలు, పెన్నులు తినుబండారాలు అందజేశారు. అమెరికా దేశస్తులు కమల, లలితా జవహరిలాల్, హనుమాన్, యేచూరి శ్రీవాణి, శ్రీనివాస్ ఏచూరి, అఖిల, గీత పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

గాండ్లపెంట: మండల పరిధిలోని మలమీదపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి శనివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నల్లమాడ: పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆవరణలో మొక్కలు పెంచాలని ఎస్ఎస్ఏ సీఎంఓ మాలిక్ విద్యార్థులకు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం 'స్వచ్ఛతాహి సేవా' కార్యక్రమం నిర్వహించారు. సీఎంఓ మాలిక్ పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు.

సచివాలయాల వ్యవస్థ దేశంలోనే గొప్పది

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

తనకల్లు: సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొక్కంటి, కొర్తికోట, బాలసముద్రం. కోటపల్లి గ్రామ సచివాలయాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. నూతన పింఛన్లు, జగనన్న చేయూత, జగనన్న ఆరోగ్య సురక్ష, అమ్మ ఒడి తదితర పథకాల అమలుపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. గృహ సారథుల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై జేసీఎస్ ఇంచార్జ్, సచివాలయాల కన్వీనర్లతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో గ్రామ సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. సచివాలయాల ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హత కలిగి ఉన్నా ఇతర కారణాలతో పథకాలు అందని వారిని గుర్తించి ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, నాయకులు శ్రీనివాసులునాయుడు, చిన్నపరెడ్డి, గంగప్పనాయుడు, హేమశేఖర్‌రెడ్డి, బాబాఫక్రుద్దీన్, హేమంత్‌నాయుడు, పూల శీనా, అబ్దుల్, ఇటుక వెంకటరమణ, శ్రీరాములు, అయూబ్, వెంకటనారాయణ, శంకర్‌రెడ్డి, బాబ్‌జాన్ పాల్గొన్నారు.


కొక్కంటి గ్రామ సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలి

బత్తలపల్లి: జగనన్న లేవుట్‌లలో ఇంటి పట్టాలు పొందినవారు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీఓ సౌజన్యకుమారి అన్నారు. శనివారం ఆమె జగనన్న లేవుట్‌లో పర్యటించి ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. కొందరు నిర్మాణాలను చేపట్టకపోవడంతో కారణాలు అడిగి తెలుసుకున్నారు. బిల్లులు త్వరగా మంజూరవుతున్నాయని, త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తమకు జాబ్‌కార్డులు లేవని కొందరు ఎంపీడీఓ దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరించాలని ఏపీఓ ఆదెప్పకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలు తవ్వించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. తర్వాత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రస్తుతం కేంద్రం పని చేయకపోవడంతో పునః ప్రారంభించాలని కార్యదర్శి ఈశ్వరయ్యకు సూచించారు. ఎంఈఓ ఛాముండేశ్వరి పాల్గొన్నారు.

బైబై గణేశా


ఈశ్వరమ్మ నగర్‌లో వినాయక నిమజ్జనంలో నృత్యాలు చేస్తున్న మహిళలు


ధర్మవరంలో వినాయక నిమజ్జన ఊరేగింపు


ధర్మవరంలో విగ్రహాల ఊరేగింపు

పుట్టపర్తి అర్బన్: పలు గ్రామాల్లో శనివారం వినాయక విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా సాగింది. యువతీ యువకులు నృత్యాలు చేస్తూ గణపయ్యలను గంగ ఒడికి చేర్చారు. పుట్టపర్తి నగర పంచాయతీలోని ప్రశాంతిగ్రామం, ఎనుములపల్లి, గోకులం, ఈశ్వరమ్మ నగర్‌లో విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చిత్రావతితో పాటు బుక్కపట్నం చెరువులో నిమజ్జనం చేశారు. ఈశ్వరమ్మ నగర్‌లో వినాయక మండపం వద్ద లడ్డూను వేలం వేయగా బాలాజీ అనే వ్యక్తి రూ.37వేలకు దక్కించుకున్నారు. భక్తులకు ప్రసాదాలు పంచి పెట్టారు.

పుట్టపర్తి: బుక్కపట్నం, జానకంపల్లిలో వినాయక నిమజ్జనం అట్టహాసంగా నిర్వహించారు. జై గణేశ్ నామస్మరణతో వీధులు మార్మోగాయి.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లో కొలువైన వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

తనకల్లు: బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి సూచించారు. మార్పురివాండ్లపల్లిలో బాల్య వివాహాలపై శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండిన తరువాతనే వివాహాలు జరిపించాలన్నారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న కిషోర బాలికలకు అవగాహన కల్పించాలన్నారు.

తలుపుల: మండలంలోని కుర్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పౌష్టి కాహారం, బాల్యవివాహాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే


సర్వేలో పాల్గొన్న వైద్యాధికారి గణేనాయక్

నల్లమాడ: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది శనివారం దొన్నికోటలో సర్వే నిర్వహించారు. ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ తనిఖీ చేసి సర్వే తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

వినాయక లడ్డూ రూ.1.46 లక్షలు

ధర్మవరం: పట్టణంలోని 16వ వార్డు సచివాలయం వెనుక శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన లడ్డూ, రెండు వెండి కాయిన్లకు శనివారం వేలం పాట నిర్వహించారు. లడ్డూను పరిసే నారప్ప కుమారుడు పరిసే నరసింహులు రూ.1,46,116కు వేలంపాటలో దక్కించుకున్నాడు. వెండి కాయిన్ పోలా బ్రదర్స్ రూ.18వేలు, రెండో వెండి కాయిన్ మామిళ్ల రాకేష్ రూ.23వేలకు దక్కించుకున్నారు. 19వవార్డు ఇందిరానగర్‌లోని వరసిద్ధి వినాయకుడి లడ్డూను గంధోడి రమణయ్య, శ్రీదేవి దంపతులు వేలం పాటలో రూ.20,116లకు దక్కించుకున్నారు.

నల్లమాడ: దొన్నికోటలో శనివారం వినాయకుడి లడ్డూను బసిరెడ్డి సంతోష్‌రెడ్డి రూ.25,516 లకు పాట పాడి దక్కించుకున్నారు. గ్రామంలో వినాయక నిమజ్జనం కోలాహలంగా సాగింది.


లడ్డూ దక్కించుకున్న నారప్ప కుటుంబ సభ్యులు

పెరుగుతున్న టమాట సాగు విస్తీర్ణం

- 600 ఎకరాల్లో టమాట సాగు
- మెలకువలు పాటిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్న రైతులు

నల్లచెరువు: మండలంలో టమాట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ రైతులు ఉత్తమ దిగుబడులు సాధిస్తున్నారు. నాణ్యమైన టమాటను మార్కెట్లకు తరలించి మంచి లాభాలు గడిస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు ఆరు వందల ఎకరాలకు పైగా టమాట సాగులో ఉంది. మొక్క నాటిన తర్వాత 60 రోజులకు పంట కోతకు వస్తుంది. ఈక్రమంలో మొక్క నాటినప్పటినుంచి సేద్యం, కలుపులు, చీడపీడల నివారణ తదితరవాటికి రూ.70 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. టమాట మొక్క ఎత్తుగా పెరుగుతుంది. దానికి సరైన ఆధారం అందించాలి. ఈక్రమంలో రైతులు కర్రలు కట్టి మొక్క పెరిగేలా చర్యలు తీసుకున్నారు. టమాట కాయలు కూడా పాడవకుండా నాణ్యతగా ఉంటాయి. ఇలా అనేక మెలకువలతో పంట సాగులో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏడాది పొడవునా టమాట సాగు చేస్తున్నారు. ఎకరాకు 1500 బాక్సుల(ఒకబాక్స్ 30కేజీలు) దిగుబడి వస్తుందని, ఇక్కడ పండిన టమాటకు మదనపల్లి, కోలార్, చింతామణి మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంటుందని రైతులు చెబుతున్నారు. జూన్, జూలై,ఆగస్ట్ నెలల్లో మదనపల్లి మార్కెట్లో 30కేజీల బాక్స్ రూ.5వేల నుంచి 6వేల వరకు రికార్డు ధర పలికినట్లు రైతులు చెబుతున్నారు. ఎకరానికి రూ.7లక్షల నుంచి రూ.10 లక్షల లాభాలు గడించారు.



దేవిరెడ్డిపల్లి వద్ద సాగులో ఉన్న టమాట, కుంట్లపల్లి వారి పల్లిలో మార్కెట్‌కు తరలించేందుకు టమాటాలు సిద్ధం

పది ఎకరాల్లో సాగు చేశా



నాకున్న సుమారు 10 ఎకరాల్లో టమాట సాగు చేశాను. సుమారు రూ.8 లక్షలకు పైగా ఖర్చు చేశాను. ఆగస్టు చివరి వారం నుంచి పంట కోతకు వచ్చింది. మదనపల్లి మార్కెట్లో 30 కేజీల బాక్సును రూ.300తో విక్రయించాను.

– హనుమంతు రెడ్డి, రైతు, త్యారన్నగారిపల్లి

రూ.10 లక్షల ఆదాయం వచ్చింది



నాకున్న రెండు ఎకరాల్లో టమాటా సాగుచేశా. పెట్టుబడి రూ.2 లక్షలు వరకూ ఖర్చు అయింది. జూన్, జులై నెలల్లో పంటను విక్రయించాను. ఆ సమయంలో ఎండలు తీవ్రంగా ఉండటంతో దేశ వ్యాప్తంగా దిగుబడి తగ్గింది. దీంతో టమాటకు డిమాండ్ పెరగడంతో ఒకే నెలలో రూ.10 లక్షల ఆదాయం వచ్చింది.

– లక్ష్మీపతి, బందార్లపల్లి

సామూహిక సెలవులు మంజూరు చేయండి

కనగానపల్లి: విజయవాడలో ఈ నెల 25న చేపట్టనున్న కాంట్రాక్టు ఉద్యోగుల సత్యాగ్రహ దీక్షలో పాల్గొనేందుకు వెళ్తున్న తమకు సామూహిక సెలవు మంజూరు చేయాలని స్థానిక ఎంఈఓ కార్యాలయ సిబ్బంది అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక కార్యాలయం వద్ద ఎంఈఓ– 2 శ్రీదేవికి వారు వినతిపత్రం అందజేశారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ హెచ్ రామన్న, డీటీఈఓ బి నారాయణస్వామి, అకౌంటెంట్ రాజేష్, సీఆర్‌పీలు మారుతీప్రసాద్, వరలక్ష్మి, ఐఈఆర్టీ జగదీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశంసాపత్రాల అందజేత


విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కొత్తచెరువులో ఈ నెల 21న జరిగిన జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీల్లో విజేతలకు శనివారం స్థానిక భవిత కేంద్రంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంఈఓలు చెన్నిక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ కదిరి భవితా కేంద్రానికి సంబంధించి ఆరు మంది దివ్యాంగ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు రావడం సంతోషమన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తులు

తలుపుల: మండలంలో ఖాళీగా ఉన్న కొవ్వూరివాండ్లపల్లి (బీసీ.బి), ఏపులపల్లి (డిజేబిల్డ్) అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్ దీప తెలిపారు. ఈ నెల 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రీ సర్వేకు సహకరించాలి


పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాఘవేంద్ర

అమడగూరు: జేకేపల్లి గ్రామ పంచాయతీలో రెవెన్యూ అధికారులు జగనన్న భూరక్ష పథకం కింద నిర్వహిస్తున్న రీ సర్వే పనులను ఆర్డీఓ రాఘవేంద్ర శనివారం పరిశీలించారు. రీసర్వేలో ఎలాంటి అవకతవకలకు తావు లేదని, రైతులంతా పొలాలకు వెళ్లి అధికారులకు సహకరించాలన్నారు. అనంతరం అమడగూరు రెవెన్యూ పొలంలో సమస్యగా ఉన్న రైతు విజయదేవరెడ్డి పొలాన్ని పరిశీలించారు.

ఆరోగ్య మేళాకు స్పందన


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్ పుష్పలత

ధర్మవరం రూరల్: ఆయుష్మాన్‌భవ కింద మండల పరిధిలోని దర్శనమల పీహెచ్‌సీలో శనివారం ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ పుష్పలత రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కొందరు అదే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్ గరుడంపల్లి గ్రామంలో తనిఖీ చేశారు. సీహెచ్ఓ కళావతి, సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వ్రతం


వ్రతం ఆచరిస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను అర్చకులు రాజేష్ వివిధ రకాల పూలు, తులసిమాలలు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

సర్వే త్వరగా పూర్తి చేయండి

నల్లచెరువు: జగనన్న పాల వెల్లువ సర్వేపై తలమర్లవాండ్లపల్లి సచివాలయంలో ఎంపీడీఓ శకుంతల శనివారం వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సర్వే త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు.

మహిళ అనుమానాస్పద మృతి

నందలూరు (రాజంపేట) : ముద్దిగుబ్బ టీచర్స్ కాలనీకి చెందిన కసపర్తి జయమ్మ అనే మహిళ అన్నమయ్య జిల్లాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె పెనగలూరు మండలం నల్లతిమ్మయ్యగారిపల్లి గ్రామ పంచాయతీలోని నల్లపరెడ్డిపల్లెకు చెందిన చెల్లెలి ఇంటికి వచ్చింది. తిరిగి కడపకు వెళ్తూ నందలూరులో దిగింది. ఆ తర్వాత చెయ్యేరులో శవమై తేలింది. వాకింగ్ చేస్తున్న ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. వారు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి కేసు దర్యాప్తు చేపట్టారు.

రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు


విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: చవిటితండా, గొల్లోల్ల చెరువు, చిగురుమానుతండాలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శనివారం హార్ట్ టు హెల్ప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు రవినాయక్, జననీ క్లినికల్ ల్యాబ్ నిర్వాహకుడు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.